జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








| శనివారం 17 జనవరి 2026 | పేజీలు 04 , వేల రూ 2/- | సంపుటి 1 | సంచిక 231 | ప్రచురణ : తెలంగాణ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|


# ఆదిలాబాద్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

## బాసరలో యూనివర్సిటీ, నిర్మల్‌లో ATC, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు

### ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి






సందేశం టైమ్స్ : ఆదిలాబాద్ / నిర్మల్, జనవరి :

తెలంగాణలో అత్యంత వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు పలు కీలక అభివృద్ధి ప్రణాళికలను ప్రకటించారు. బాసర ఐఐఐటీలో విశ్వవిద్యాలయం ఏర్పాటు, నిర్మల్‌లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ATC) స్థాపన, తాగు మరియు సాగునీటి అవసరాల కోసం తుమ్మిడిహెట్టి వద్ద చేవెళ్ల–ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం, జిల్లాలో అతిపెద్ద పారిశ్రామిక కేంద్రం అభివృద్ధి వంటి కీలక నిర్ణయాలను వెల్లడించారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.386.46 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మల్ పట్టణంలో నిర్వహించిన "ప్రజా పాలన – ప్రగతి బాట" బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "తెలంగాణలో అత్యంత వెనుకబడిన జిల్లా ఆదిలాబాద్. ఈ జిల్లాకు రావలసినంత అభివృద్ధి, రావలసినంత నీరు రాలేదు. పాలమూరు జిల్లాకు ఇచ్చిన ప్రాధాన్యతే ఆదిలాబాద్‌కూ ఇస్తాం. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది" అని స్పష్టం చేశారు.చనాక–కొరాట బ్యారేజీకి మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి గారి పేరు, సదర్మట్ బ్యారేజీకి స్వతంత్ర సమరయోధుడు, మాజీ మంత్రి పి. నర్సారెడ్డి గారి పేరు పెట్టనున్నట్లు ప్రకటించారు. దీనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.పదేళ్ల పాటు పూర్తి కాకుండా ఉన్న చనాక–కొరాట ప్రాజెక్టును ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి చేసినట్లు తెలిపారు. నిర్మల్‌లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తామని, సరస్వతీ ఆలయం ఉన్న బాసర ఐఐఐటీలోనే విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. "యూనివర్సిటీ ఎక్కడ అనే చర్చల్లో కాలయాపన కాకుండా బాసరలోనే ప్రారంభిస్తున్నాం" అని చెప్పారు.అదేవిధంగా ఆదిలాబాద్ జిల్లాలో 10 వేల ఎకరాల భూమిని సేకరించి రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసి దేశంలోని ప్రముఖ పరిశ్రమలను ఇక్కడికి తీసుకొస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.ఎన్నికల రాజకీయాలకు స్వస్తి చెప్పి, ప్రజల కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. "ఎర్ర బస్సు కూడా రాకపోయిన పరిస్థితి నుంచి ఎయిర్ బస్సు వచ్చే స్థాయికి ఆదిలాబాద్‌ను తీసుకెళ్తాం" అని వ్యాఖ్యానించారు.ఫిబ్రవరి మొదటి వారంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో, అనంతరం అధికార యంత్రాంగంతో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా బడ్జెట్ సమావేశాల్లో అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు.తుమ్మిడిహెట్టి వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును తప్పకుండా నిర్మిస్తామని, దీనికి డీపీఆర్ సిద్ధమవుతోందని చెప్పారు. మహారాష్ట్ర అనుమతుల అంశంపై అవసరమైతే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిని కూడా కలుస్తామని వెల్లడించారు.నాగోబా జాతర అభివృద్ధికి రూ.22 కోట్లు మంజూరు చేస్తామని, మేడారం సమ్మక్క–సారలమ్మ మందిర అభివృద్ధికి ఇప్పటికే సుమారు రూ.300 కోట్లతో కుంభమేళా స్థాయిలో పనులు చేపట్టామని తెలిపారు.

"మేం పాలకులం కాదు... ప్రజల సేవకులం. భవిష్యత్ తరాల కోసం ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




# హైదరాబాద్ పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు: 'షబ్-ఎ-మెరాజ్' సందర్భంగా పోలీసుల హై అలర్ట్

హైదరాబాద్, సందేశం టైమ్స్: ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే 'షబ్-ఎ-మెరాజ్' (జగ్నే కి రాత్) పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాతబస్తీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, మరియు భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

ముఖ్య అంశాలు: ఫ్లై ఓవర్ల మూసివేత: రాత్రి వేళల్లో రోడ్లపై యువకులు బైక్ రేసింగ్‌లు, విన్యాసాలు చేయకుండా నివారించేందుకు నగరంలోని ప్రధాన ఫ్లై ఓవర్లను రాత్రి 10 గంటల తర్వాత మూసివేయనున్నారు. అయితే, గ్రీన్‌ల్యాండ్స్ ఫ్లై ఓవర్, పీవీ ఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే, లంగర్ హౌస్ ఫ్లై ఓవర్లకు మాత్రం దీని నుండి మినహాయింపు ఇచ్చారు.పాతబస్తీలో ఆంక్షలు: చార్మినార్, మక్కా మసీదు పరిసర ప్రాంతాల్లో ప్రార్థనల కోసం వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. నయాపూల్, మదీనా, చార్మినార్ వైపు వెళ్లే సాధారణ వాహనాలను దారి మళ్లించనున్నారు.భద్రత కట్టుదిట్టం: పాతబస్తీలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. సౌత్ జోన్ పరిధిలో అదనపు బలగాలను మోహరించారు.పోలీసుల విజ్ఞప్తి: ప్రయాణికులు ట్రాఫిక్ ఆంక్షలను గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని, పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. అత్యవసరమైతే తప్ప రాత్రి వేళల్లో పాతబస్తీ వైపు ప్రయాణాలు పెట్టుకోవద్దని సూచించారు.



# సోషల్ మీడియా వేధింపులపై అనసూయ 'సైబర్' యుద్ధం: జర్నలిస్టులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సహా 73 మందిపై కేసు

హైదరాబాద్, సందేశం టైమ్స్:.సోషల్ మీడియా వేదికగా తనపై జరుగుతున్న అసభ్యకర ప్రచారం, వ్యక్తిత్వ హననంపై ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ కొరడా ఝుళిపించారు. తన పరువుకు భంగం కలిగించేలా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన పోరాటానికి దిగారు. అనసూయ ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు ఏకంగా 73 మందిపై కేసులు నమోదు చేయడం సంచలనం సృష్టిస్తోంది. ముఖ్య అంశాలు:73 మందిపై ఎఫ్.ఐ.ఆర్ (FIR): అనసూయ తొలుత 42 మందిపై ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టిన పోలీసులు యూట్యూబ్ ఛానెళ్ల నిర్వాహకులు, జర్నలిస్టులు, టీవీ యాంకర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో కలిపి మొత్తం 73 మందిపై కేసులు బనాయించారు.డీప్‌ఫేక్ & మార్ఫింగ్: కేవలం విమర్శలే కాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికతను వాడి తన ఫోటోలను మార్ఫింగ్ చేస్తున్నారని, అసభ్యకరమైన వీడియోలను సృష్టిస్తున్నారని అనసూయ ఆవేదన వ్యక్తం చేశారు.కఠిన సెక్షన్ల కింద కేసులు: నిందితులపై భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్లు 75, 79, 336(4), 351, 356 మరియు ఐటీ చట్టంలోని 66-E, 67 సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.చిన్మయి మద్దతు: ఈ వ్యవహారంపై స్పందించిన సింగర్ చిన్మయి శ్రీపాద.. అనసూయకు మద్దతుగా నిలిచారు. వేధింపులకు పాల్పడిన వారిలో రాజకీయ నాయకులు కూడా ఉన్నారని, మహిళల భద్రత పట్ల పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆమె డిమాండ్ చేశారు.ఆన్‌లైన్ వేధింపులను ఇక ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని అనసూయ ఈ చర్య ద్వారా స్పష్టం చేశారు.

# జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంక్రాంతి ముగ్గు కార్యక్రమం

## ట్రాఫిక్ నిబంధనలు, చైనా మాంజాపై అవగాహన





సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గం ఇంచార్జి (కే. సంగమేశ్వర్)సంగారెడ్డి జిల్లా , సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సంక్రాంతి ముగ్గు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో సుందరంగా అలంకరించారు.తెలుగుదనం ఉట్టిపడేలా రూపొందించిన ఈ ముగ్గుల్లో ట్రాఫిక్ నిబంధనలు, చైనా మాంజా వల్ల ప్రాణాలకు ముప్పు, మద్యం సేవించి వాహనాలు నడపరాదనే అంశాలను ప్రతిబింబించే చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ వనజ ఈ ముగ్గును అత్యంత ఆకర్షణీయంగా రూపొందించి ప్రజల్లో అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమం ద్వారా సంప్రదాయ పండుగల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు సమాజంలో సాంస్కృతిక విలువలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు సంక్రాంతి పండుగను శాంతి, సంతోషాలతో జరుపుకోవాలని, పండుగ వేళ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ చైనా మాంజా వినియోగానికి దూరంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# సంక్రాంతి ఉత్సాహం

సంగారెడ్డి/జనవరి 14(సందేశం టైమ్స్: సంగారెడ్డి టౌన్ ప్రతినిధి: బి. సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం వట్టిపల్లి మండల పరిధిలోని మరవెల్లి గ్రామంలో చిన్నారులు ఉదయాన్నే లేచి ఇంటి ముందర ముగ్గులు వేస్తూ పెద్దలకు ఆనందాన్ని కలుగజేశారు. మహిళలు ముగ్గులు వేస్తూ సంక్రాంతి పండగ ముగ్గులు వేస్తూ దారిలో వెళ్తున్నటువంటి తోటి వారందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు అంటూ వారు అంగరంగ వైభవంగా వాకిట్లో ముగ్గులు వేశారు చిన్నారులు ముగ్గులు వేయడాన్ని చూసిన వారందరూ సంతోషించారు




# పరిశ్రమలకు సకాలంలో అనుమతులు జారీ చేయాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, జనవరి 16 : పరిశ్రమల స్థాపన, అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించాలంటే అధికారులు నిబంధనల మేరకు సకాలంలో అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీసీ హాల్‌లో శుక్రవారం జిల్లా పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీతో పాటు టీజీఐపాస్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో ఏర్పాటు చేయనున్న వివిధ పరిశ్రమలకు సంబంధించి వచ్చిన అనుమతులపై సమగ్రంగా సమీక్షించారు.మొత్తం 49 పరిశ్రమలకు గాను 119 అనుమతులు వివిధ శాఖల నుంచి వచ్చినట్లు అధికారులు వివరించారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన ఆమోదాలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.అదేవిధంగా, టి-ప్రైడ్ పథకం కింద జిల్లాలోని 143 మంది లబ్ధిదారులకు రాయితీలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు, ఫార్మా, సిమెంట్ పరిశ్రమల్లో భద్రతా నిబంధనలు పాటిస్తున్న తీరుపై త్వరలో సంబంధిత అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి. సీతారాం, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ బి. యాదగిరి, జిల్లా పరిషత్ అధికారి కె. యాదగిరి, ఆర్‌టీఓ జయప్రకాష్ రెడ్డి, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి దయానంద రాణి, ఎస్టీ డెవలప్మెంట్ అధికారి కె. శంకర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి.. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ గౌడ్

## బిజిలీపూర్ లో వాలీబాల్, కబడ్డీ క్రీడల విజేతలకు బహుమతుల ప్రధానం

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)16జనవరి సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలోని బిజిలిపూర్ గ్రామం లో
యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకురాలు అరగొండ మహానంద అరవింద్ ఆద్వర్యంలో సీడీఆర్ వాలీబాల్, కబడ్డీ పోటీల బహుమతుల ప్రధానోత్సవంలో పాల్గొని విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. వాలీబాల్ పోటీలో శివాజీ యూత్ టీం మొదటి బహుమతి, భరత్ టీం రెండవ బహుమతి, కబడ్డీ పోటీలో నరేష్ టీం ప్రథమ బహుమతి, లోకేష్ టీం ద్వితీయ బహుమతి సాధించాయి.అంతకు ముందు కబడ్డీ ఫైనల్ పోరు సందర్భంగా వినయ్ గౌడ్ టాస్ వేసి అనంతరం కాసేపు కబడ్డీ ఆడి క్రీడాకారులల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో పాటు క్రీడల ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, దీంతోపాటు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుడ్యానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. క్రీడా పోటీలలో ప్రతి ఒక్కరూ గెలుపు, ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపేవారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని గ్రామీణ క్రీడల్లో రాణించే వారు జాతీయ స్థాయి ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యతను కల్పిస్తూ , గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. జీవితంలో స్థిరపడాలన్నా, ఉద్యోగాలు సంపాదించాలన్నా భవిష్యత్‌లో స్పోర్ట్స్ కోటా ఉంటుందని తెలపారు. కార్యక్రమంలో బిజిలీపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగప్ప, సర్పంచ్ నాగమణి నర్సింలు, కేరుర్ గ్రామ సర్పంచ్ కార్తీక్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు అరవింద్,వార్డు మెంబర్లు, మల్లేశం,కాశినాథ్,కుమార్, శివశంకర్, మాజీ ఏంపిటిసి సదానందం తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# సిద్ధంరెడ్డి నారాయణ్‌రెడ్డిని పరామర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్:సంగారెడ్డి టౌన్ రీపోటర్ (బి. సంగమేశ్వర్)జనవరి 16
హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగారెడ్డి జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి సిద్ధంరెడ్డి నారాయణ్‌రెడ్డిని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం స్వయంగా వెళ్లి పరామర్శించారు.సంగారెడ్డి జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి సిద్ధంరెడ్డి నారాయణ్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయంగా ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా నారాయణ్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే వారి కుమారుడు, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఉజ్వల్ రెడ్డితో మాట్లాడి ధైర్యం చెప్పారు. నారాయణ్‌రెడ్డి త్వరగా పూర్తిగా కోలుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆకాంక్షించారు.





# జోగిపేట 14వ వార్డులో సంక్రాంతి ముగ్గుల పోటీలు

## విజేతలకు పట్టు చీరల బహుమతులు

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి(టీ. సంగమేశ్వర్)16జనవరి సంగారెడ్డి జిల్లా "అందోల్ నియోజకవర్గం జోగిపేట పట్టణంలోని 14వ వార్డులో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పల్లె వెంకట రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన మహిళలకు మొదటి, రెండో, మూడో బహుమతులుగా పట్టు చీరలను మాజీ శాసనసభ్యులు క్రాంతి కిరణ్ చేతులమీదుగా అందజేశారు. అదేవిధంగా యువకుల కోసం క్యారమ్ పోటీలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, నాగభూషణం, నారాయణ, చాపల వెంకటేశం, శేఖర్, ముదాయిపేట జిన్నా విజయ్, అశోక్, సాయికుమార్ (పింట్టు), చౌరీగారి నర్సింలు, బిర్లా కంకర్, నజీర్, ముర్క గల్లా దేవేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు."

# గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయికి వెళ్ళాలి...యువజన కాంగ్రెస్ మండల అద్యక్షుడు ప్రవీణ్‌ముదిరాజ్, క్రికెట్, వాలీబాల్ పోటీల విజేతలుగా నిలిచిన శ్రీకాంత్, దత్తు టీంలు,అలంరించిన కబడ్డీ జూనియర్ పోటీలు...



విజేతగా నిలిచిన ప్రవీణ్ టీం, కీ.శే బి.సాయికుమార్ జ్ఞాపకార్థం విజేతలకు బహుమతల ప్రధానం, అట్టహాసంగా ముగిసిన కేపీఎల్ సీజన్-3

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)16జనవరి
గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయి వరకు వెళ్లాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ మండల అద్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, ఏయంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కన్‌సాన్‌పల్లి ప్రీమియర్ లీగ్ సీజన్-3 పోటీలలో భాగంగా చివరి రోజు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొదటగా దేవునూరి శ్రీశైలం జట్టు, జోగాల శివకుమార్ జట్టు మద్య సాగిన హోరాహోరీగా పోరులో శివకుమార్ జట్టు విజయం సాధించింది. చివరి ఫైనల్ పోటీలో శివకుమార్ జట్టు, తలారీ దత్తు టీం జట్ల మధ్య పోరు సరవత్తరంగా సాగడంతో అందరినీ ఆకర్షించింది. చివరగా తలారీ దత్తు టీం విజయం సాధించింది. ద్వితీయ స్థానంలో శివకుమార్ జట్టు నిలిచింది. అంతకు ముందు క్రికెట్ ఫైనల్ పోటీల్లో సంగాన్నగారి శ్రీకాంత్ (కన్‌సాన్‌పల్లి టైటాన్స్)జట్టు, తలారి బాలక్రిష్ణ (కన్‌సాన్‌పల్లి చాలెంజర్స్) జట్ల మద్య సాగిన పోరులో టైటాన్స్ జట్టు అద్భుతమైన పోలింగ్ ప్రదర్శించడంతో చాలెంజర్స్ జట్టు తక్కువ స్కోరుకే పరిమితం కావడం అటు తర్వాత టైటాన్స్ జట్టు సునాయస విజయాన్ని అందుకొని విజేతగా నిలిచింది. కేపిఎల్ సీజన్-3లో మొదటిసారిగా ప్రవేశపెట్టి జూనియర్స్ కబడ్డి పోటీలు అందరిని అలరించారు. మొదటి సారి జరుగుతున్న కబడ్డీ పోటీలను వీక్షించేందుకు గ్రామం నుండి పెద్ద ఎత్తున ప్రేక్షకులు తరలిరావడం రావడంతో ఒక్కసారిగా అక్కడి వాతావరణం క్రీడా సంబరంగా మారింది. మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో ప్రేక్షకుల నుండి మద్దతు పెరిగిపోవడంతో క్రీడాకారులు ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ క్రీడలు ఆడారు. చివరి పోటీలో పల్టాన్స్ మహేష్ టీం, నరహరి టైటాన్స్ టీం లు తలపడగా మహేష్ టీం పైచేయి సాధించి విజేతగా నిలిచింది. -విజేతలకు బహుమతల ప్రధానం..ఈ సీజన్‌లో జరిగిన పోటీలకు సంబందించి కీ.శే బుసనెల్లి సాయికుమార్ జ్ఞాపకార్థంగా ఆయన సోదరుడు బుసనెల్లి అంజనేయులు బహుమతులను ప్రధానం చేశారు. గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేదికను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రామానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ సునీత మహిపాల్,యువజన కాంగ్రెస్ మండల అద్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ హాజరై క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటయ్య, మాజీ ఎంపిటీసీ బాలయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేష్‌రావు, వార్డు సభ్యులు మహిపాల్, వని మోహన్, తలారి బాలక్రిష్ణ, కలపల్లి లక్ష్మీప్రభు, రామాదేవి దుర్గేష్, యువ నాయకులు దేవునూరి శ్రీశైలం, జోగాల గోవర్ధన్, పంతులు ఈశ్వర్, రఘు, వహీద్, షర్ఫొద్దీన్, కాడెం శ్రీనివాస్,బాల్‌రాజ్, మణికంఠ, ముదిరాజ్ సంఘ అద్యక్షుడు ఈశ్వర్, మాజీ వార్డు సభ్యులు దత్తు, నాయకులు దుర్గయ్య, యాదయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.-కేపిఎల్ క్రీడలు విజయవంతం...కేపిఎల్ సీజన్-3 క్రీడలలో భాగంగా కబడ్డీ,వాలిబాల్, క్రికెట్ అను మూడు విభాగాలలో క్రీడలు నిర్వహించారు. మూడు రోజుల పాటు క్రీడలు సాగగా అందుకు మైదానాల ఏర్పాటు నుండి క్రీడాకారులకు సౌకర్యాల కల్పన వరకు ఎటువంటి ఇబ్బంతులు తలెత్తకుండా నిర్వహకులు బాలక్రిష్ణ, రాపర్తి ప్రభు, జోగాల ప్రవీణ్, క్రిష్ణలు చర్యలు తీసుకున్నారు.ఆటల్లో పాల్గొన్న 150 మంది క్రీడాకారులకు యువజన కాంగ్రెస్ అద్యక్షుడు జర్సీలు ఉచితంగా అందజేయగా, క్రీడాకారులకు అన్నధాన కార్యక్రమాన్ని పోలీసు దత్తు, యువ నాయకుడు పంతులు ఈశ్వర్ కూల్‌డ్రింక్స్‌తో పాటు క్రికెట్ బ్యాట్లు ,పి.భాగేష్ త్రాగునీటిని సరఫరా చేయగా,దేవునూరి ప్రభు ఆటగాళ్ల అందరికీ ఆరటి పళ్లను, వాలీబాల్ ఆట వస్తువులు వహీద్, అలసిపోయిన సందర్భంలో తక్షణ శక్తని ఇచ్చేందుకు గ్లూకోండిని గొళ్ల కళ్యాణ్ , తాళ్ల మణికంఠ డిజే సౌండ్, టెంట్‌హౌజ్ ఏర్పాటుచేశారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రధానమైన ఏర్పాట్లు చేయడంలో చేయూతను అందించి క్రీడలను విజయవంతం చేయడంలో కృషి చేయడం పట్ల వారిని అందరూ అభినందించారు.



## 2వ వార్డ్ లో నీటి సమస్యకు బోరు వేయించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోశికే రాజశేఖర్

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)16జనవరి సంగారెడ్డి జిల్లా, అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో రెండోవ వార్డ్ లో నీటి సమస్య ఉందని తెలుసుకొని తన సొంతగా కోశికే రాజశేఖర్ బోర్ వేయించాడు. బోర్ వేసిన సందర్భంగా నీళ్లు పడ్డాయని అక్కడ ఉన్న ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. నీటి సమస్య తీర్చిన కొశికే రాజశేఖర్ కి అక్కడి ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మన వార్డులో ఏ సమస్య ఉన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టి తీసుకెళ్లి త్వరితగతిన సమస్యలు తీర్చగలనని రాజశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో చండూరి నాగరాజ్, డాకూరి రఘు, పిట్ల సంపత్, మంగళ కిరణ్, పిట్ల ప్రశాంత్, పిట్ల జగదీష్, శివయ్య, శ్రీను, సంగయ్య, భరత్, సంగప్ప, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సాయిపేట్ గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ క్రీడాకారులకు బహుమతులు



సంగారెడ్డి | వట్పల్లి మండల్

సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గం ఇంచార్జి (కే. సంగమేశ్వర్)జనవరి 16, సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలోని సాయిపేట్ గ్రామంలో కార్చెల్ల సంగమేశ్వర్, నల్లవల్లి అడివప్ప, ఆలూరి వీరన్న, కాలాలి యాదగౌడ్ ఆధ్వర్యంలో విలేజ్ వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "యువత క్రీడల్లో రాణించి అద్భుతమైన ప్రతిభ చూపితే గ్రామానికి మంచి గుర్తింపు, పేరు, ప్రఖ్యాతులు వస్తాయి మరియు ముందతరం యువతకు దిశానిర్దేశం అవుతుందని అన్నారు. గ్రామ సర్పంచ్ ఆలూరి సంతోష- ఆంజనేయులు క్రీడాకారులను అభినందించి టాస్ వేసి తొలి ఆటను సర్వీస్ చేసి యువకుల్లో ఉత్సాహాన్ని నింపారు. మొత్తం 5 జట్లు పోటీకి ఎంటర్ అయ్యాయి. ప్రథమ బహుమతిగా రూ.6000, రెండవ బహుమతిగా రూ.4000 క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, క్రీడాకారులు, పెద్దలతో పాటు ప్రజలు పాల్గొన్నారు.



## యువత క్రీడల్లో రాణించాలి

సంగారెడ్డి/జనవరి 16(సందేశం టైమ్స్: సంగారెడ్డి టౌన్ ప్రతినిధి: బి. సంగమేశ్వర్) ఆందోల్ నియోజకవర్గం అల్లాదుర్గ్ మండల పరిధిలోని ముప్పారం గ్రామములో రాజు నాయక్ ఆధ్వర్యంలో ముప్పారం గ్రామం లో విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ కు ముఖ్య అతిథులుగా విచ్చేసిన అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి... యువత క్రీడల్లో రాణించి అద్భుతమైన ప్రతిభను చూపిస్తే గ్రామానికి మంచి గుర్తింపు లభిస్తుందని అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి అన్నారు. ముప్పారం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ను కొప్పుల శేషారెడ్డి, సుభాష్ రావు ,ఘనంగా ప్రారంభించారు ముందుగా క్రీడాకారులకు అభినందనలు తెలిపి టాస్ వేసి తొలి మ్యాచ్ ని ప్రారంభించారు అనంతరం శేషారెడ్డి, మరియు సుభాష్ రావు,గారికి శాలువాతో సత్కరించారు. క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు ఈ సందర్భంగా శేషారెడ్డి యువతను ఉద్దేశించి మాట్లాడారు క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వ ని క్రమశిక్షణనీ పెంచుతాయని పేర్కొన్నారు గెలుపు ఓటముల కంటే క్రీడ స్ఫూర్తితో ఆడటం ముఖ్యమని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత విట్టల్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, నాగరాజు దత్తు రెడ్డి, రాజు నాయక్, యాదగిరి, ఆంజనేయులు, వెంకట్, శివ,క్రీడాకారులు నాయకులు తదితరులు పాలుగోన్నారు




## గొర్రెకల్ గ్రామంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

### సర్పంచ్ తిరుపతి లింగారెడ్డి ఆధ్వర్యంలో

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని గొర్రెకల్ గ్రామంలో సర్పంచ్ తిరుపతి లింగారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చాకలి కిష్టమ్మకు, హుస్సేన్‌నగర్‌కు చెందిన మంగలి శ్రీకాంత్‌కు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతి లింగారెడ్డి మాట్లాడుతూ పేదల కష్టాలను తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి సీఎం సహాయ నిధి భరోసాగా నిలుస్తోందని తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమమే తమ ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు.



## సంక్రాంతి, కనుమ పండుగ కు జోగిపేటలో ఇంటింటికి గాలిపటాలు, క్యాలెండర్ల పంపిణీ

### మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)జనవరి సంగారెడ్డి జిల్లాజోగిపేట లో "సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకొని అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు ప్రతి ఇంటింటికి గాలిపటాలు, క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఆయురారోగ్యాలను అందించాలని ఆకాంక్షించారు. పండుగ వేళ సంప్రదాయాలను కాపాడుకుంటూ కుటుంబ సమేతంగా సంతోషంగా జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆందోల్ మున్సిపాలిటీ 7వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి సిద్ధం పార్టీ అవకాశం ఇస్తే బరిలో ఉంటా: సంపత్




సంగారెడ్డి, జనవరి 16 (సందేశం టైమ్స్ - సంగారెడ్డి టౌన్ రిపోర్టర్: బి. సంగమేశ్వర్):సంగారెడ్డి జిల్లా ఆందోల్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తనకు అవకాశం ఇస్తే ఏడవ వార్డు నుంచి అభ్యర్థిగా పోటీ చేస్తానని సంపత్ ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నానని తెలిపారు. పార్టీపై నమ్మకం, అనుభవాన్ని ఆధారంగా చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.ఆందోల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని, పార్టీ ఆదేశాల మేరకు ముందుకెళ్తానని సంపత్ స్పష్టం చేశారు

## మరవెల్లిలో సంక్రాంతి సందర్భంగా మినీ క్రికెట్ టోర్నమెంట్



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)జనవరి 16సంగారెడ్డి జిల్లా "సంక్రాంతి పండుగ సందర్భంగా వట్పల్లి మండల పరిధిలోని మరవెల్లి గ్రామంలో యువతను చెడు మార్గాల నుంచి దూరంగా ఉంచి క్రీడారంగంలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ చిన్నపట్ల మల్లేశ్వరమ్మ ఆధ్వర్యంలో మినీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. గ్రామ యువకులను పది జట్లుగా విభజించి నిర్వహించిన ఈ పోటీల్లో కురుమ సంఘం జట్టు విజేతగా నిలవగా, రన్నర్‌అప్ జట్టుకు రూ.2,000, విజేత జట్టుకు రూ.3,000 నగదు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ ప్రారంభంలో మాజీ సర్పంచ్ బసవరాజ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ సాయిబాబా, ఉప సర్పంచ్ భూమయ్య రాజు పటేల్, వార్డు సభ్యులు రాజు, పల్వట్ల సర్పంచ్ రాణి మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నపట్ల మల్లేశ్వరమ్మ మాట్లాడుతూ యువత శక్తిని క్రీడల వైపు మళ్లిస్తే ఆరోగ్యం, క్రమశిక్షణ పెరుగుతాయని, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు.

## పండరీపూర్ మహా పాదయాత్రలో పాల్గొన్న



### జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుఱ్ఱపు మచ్చేందర్

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్,)జనవరి 16 జుక్కల్ నియోజకవర్గంలోని శ్రీ రామలింగేశ్వర గుట్ట నుండి మల్లూరు మహారాజ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన పండరీపూర్ మహా పాదయాత్రలో కంగ్టి మండలంలో జి.ఎం.ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్ భక్తులతో కలిసి పాదయాత్రలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమానికి తన వంతు సహకారం అందించారు.ఈ మహా పాదయాత్ర భక్తుల్లో భక్తి భావాన్ని మరింత పెంచుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా అశోక్ మహారాజ్, మారుతి మహారాజ్, బీబీపేట మాజీ ఎంపిటిసి మహారెడ్డి నాగిరెడ్డి, కృష్ణాపూర్ మాజీ ఎంపిటిసి అంజయ్య సాగర్, దామర్గిద మాజీ సర్పంచ్ శంకర్ సాగర్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మారపు సాయిలు, సురేంద్ర రెడ్డి, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.


# SISF–2026 విజయవంతం కావాలంటే సమన్వయంతో పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ ప్రావీణ్య





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)16జనవరి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ (SISF)–2026 ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 19 నుంచి 23 వరకు రామచంద్రపురం మండలం కొల్లూరులో జరగనున్న ఫెయిర్ రాష్ట్ర, జిల్లా ప్రతిష్టకు కీలకమని, అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ఎంట్రెన్స్, ఎగ్జిట్ మార్గాలు, సైనేజీ, ఎగ్జిబిట్ల సంఖ్య, విద్యుత్ కనెక్షన్లు, భద్రతా ఏర్పాట్లు, వసతి, భోజనం, రవాణా వంటి ఏర్పాట్లను ఆమె పరిశీలించి, ప్రతి కమిటీ సమర్థవంతంగా, ఎలాంటి లోటు లేకుండా విధులను నిర్వర్తించాలని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేంద్ర, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, నోడల్ అధికారి లింబాజీ, ఎంఈఓ నాగేశ్వర్ నాయక్, వివిధ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# అన్ని ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తాం యువతను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే శిక్షణపై దృష్టి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 16 :
రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నింటినీ దశలవారీగా భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలో కూడా ప్రపంచంతో పోటీ పడేలా యువతను తీర్చిదిద్దే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు.
కొలువుల పండుగలో భాగంగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో 25 శాఖలకు సంబంధించిన గ్రూప్–IIIలో ఎంపికైన 1,370 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి గారు నియామక పత్రాలను లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా ఎంపికైన ఉద్యోగులు రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.
"

పరిపాలనలో ప్రక్షాళన జరగాలంటే సంపూర్ణంగా సహకరించాలి. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలి. దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణ ఎదగాలంటే మీరంతా కష్టపడి పనిచేయాలి. 30 నుంచి 35 సంవత్సరాల పాటు తెలంగాణ కోసం తల ఎత్తుకుని పనిచేశామని గర్వంగా చెప్పుకునేలా పని చేయాలి" అని ముఖ్యమంత్రి సూచించారు.

ఉద్యోగం ఒక భావోద్వేగమని, ఆ భావోద్వేగమే తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఉద్యోగులను భాగస్వాములను చేస్తుందని పేర్కొన్నారు. నాలుగు కోట్ల మంది ప్రజల కోసం పనిచేసే బాధ్యతను ప్రభుత్వ ఉద్యోగులు స్వీకరించబోతున్నారని తెలిపారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగ నియామకాలు జరుగుతాయని ప్రజలు ఆశించారని, కానీ 2014 నుంచి 2024 వరకు పదేళ్ల పాటు నియామకాలు జరగలేదని విమర్శించారు. అలాగే 14 సంవత్సరాల పాటు గ్రూప్–I నియామకాలు చేపట్టలేదని గుర్తుచేశారు.

ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే అరుదైన ఘనత సాధించామని, గడిచిన రెండేళ్లలో మొత్తం 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి, గ్రూప్–I, II, III, IV నియామకాలను యజ్ఞంలా చేపట్టామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో విద్య విస్తరించినప్పటికీ నాణ్యమైన విద్య అందకపోవడం పట్ల ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 16.5 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, 11 వేల ప్రైవేటు పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడిందో విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

నాణ్యమైన విద్య, అవసరమైన నైపుణ్యాల లేమి వల్ల అంతర్జాతీయ అవకాశాలను యువత అందిపుచ్చుకోలేకపోతున్నారని, జీవితంలో మార్పు తీసుకొచ్చేది విద్య ఒక్కటేనని స్పష్టం చేశారు. చదువే జీవితానికి గౌరవాన్ని తీసుకొస్తుందన్నారు.

2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అతి బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. ఇప్పుడు ఉద్యోగాల్లో చేరుతున్న వారంతా 2047 నాటికీ ప్రభుత్వ సేవల్లో కొనసాగుతారని తెలిపారు.

పేదలు కార్యాలయాలకు వచ్చినప్పుడు తమ సొంత తల్లిదండ్రులు వచ్చినట్లే స్పందించాలని అధికారులకు హితవు పలికారు. తల్లిదండ్రులను గౌరవించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.